• తుమ్మల మాట్లాడుతుండగానే పవర్ కట్

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ) మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతుండగానే మూడుసార్లు పవర్ కట్ కావడం విమర్శలకు దారితీసింది. ఉదయం 10 గంటలకు సిర్పూర్ డివిజన్‌లోని ఏడు మండలాల రైతులతో సిర్పూర్(టీ) రైతు వేదికలో సమావేశం ప్రారంభమైంది. మంత్రి మాట్లాడుతుండగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయి, 10 నిమిషాలకు వచ్చింది. మరో 5 నిమిషాల్లో పోయి 5 నిమిషాల తర్వాత వచ్చింది. మళ్లీ 10 నిమిషాల తర్వాత కరెంట్ పోగా.. రైతులు సమావేశం నుంచి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. తిరిగి 5 నిమిషాల తర్వాత కరెంట్ వచ్చింది.10 గంటలకు ప్రారంభమైన సమావేశం 12 గంటలకు ముగిసింది. -కుమ్రం భీం ఆసిఫాబాద్

• బ్యాటరీలతో రైతుభరోసా సమావేశం

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రైతుభరోసా'పై అన్నదాతల అభిప్రాయ సేకరణ కోసం అధికారులు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి రైతువేదికలో జరిగిన సమావేశంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు. అయితే.. సమావేశం జరుగుతున్నంత సేపు కరెంట్ లేకపోవడంతో బ్యాటరీ సహాయంతో కొనసాగించారు. ఫ్యాన్లు, కూలర్లు నడవక రైతులు, అధికారులు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. -సిద్దిపేట అర్బన్

మరో నేతన్న బలవన్మరణం

- పనులు లేక.. పోషణ భారమై.. ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య
- నాలుగు రోజుల వ్యవధిలోనే సిరిసిల్లలో ఇద్దరు నేతన్నల మృతి

నరేశ్ (ఫైల్)

సిరిసిల్ల రూరల్, జూన్ 25: సిరిసిల్లలో నేత కార్మికుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పదేండ్లుగా ఏ బాధా లేకుండా బతికిన నేత కుటుంబాలు.. కాంగ్రెస్ సర్కారు ఆర్నెళ్ల పాలనలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయి ఉపాధి కరువై, బతుకు బరువై చితికిపోతున్నాయి. నాలుగు రోజుల కిందే సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కుడిక్యాల నాగారాజు (47) ఉపాధి లేక యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువకముందే.. తాజాగా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ (టెక్స్‌టైల్ పార్క్)కి చెందిన వైపని కార్మికుడు ముదిగొండ నరేశ్ (35) ఇంట్లోనే ఉరేసుకున్నాడు. ఇందిరమ్మ కాలనీకి చెందిన ముదిగొండ శాంతవ్వ, ఈశ్వరయ్య దంపతుల కొడుకు నరేశ్ (35) వస్త్ర పరిశ్రమలో వైపని కార్మికుడి (బీములు నింపడం, పోగులు వేయడం)గా పని చేస్తున్నాడు. నరేశ్‌కు 2018లో స్వాతితో వివాహమైంది. మొదటి సంతానంలో కొడుకు జన్మించినా.. ప్రసవ సమయంలో ఉమ్మనీరు మింగడంతో మృతి చెందాడు. స్వాతి రెండోసారి గర్భం దాల్చినా కొన్ని కారణాలతో కడుపులోనే శిశువు మృతి చెందింది. ఇక తల్లి శాంతవ్వ పక్షవాతంతో మంచం పట్టగా.. తండ్రి ఈశ్వరయ్య వృద్ధాప్యంతో అచేతన స్థితిలో ఉన్నాడు. ఇన్నేండ్లూ వీరి ఆలనాపాలన నరేశ్-స్వాతి చూసుకుంటున్నారు. స్వాతి బీడీలు చుడుతూ భర్తకు చేదోడువాదోడుగా ఉన్నది. ఆరు నెలలుగా నరేశ్‌కు పనిలేక ఖాళీగా ఉన్నాడు. కుటుంబం గడవని పరిస్థితి నెలకొంది. సభ్యుల వైద్యానికి తెచ్చిన అప్పులు పేరుకుపోవడంతో అవస్థలు పడుతున్నాడు. పని లేక.. అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్తాపం చెంది సోమవారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోనే ఉరేసుకున్నాడు. ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేతన్న కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

- చేనేత ఆత్మహత్యలపై సమగ్ర విచారణ
- నేత కార్మికుల సంక్షేమానికి నూతన పథకం
- చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, జూన్ 25(నమస్తే తెలంగాణ): ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు సిరిసిల్లలో ఆత్మహత్య చేసుకున్న ఆరుగురు చేనేత కార్మికుల ఆత్మహత్యలపై విచారణ జరిపించి అర్హులైన వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించనున్నట్టు చేనేత,జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమానికి త్వరలోనే నూతన పథకాన్ని రూపొందిస్తున్నట్టు ఆయన చెప్పారు. రాష్ట్రంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) ఏర్పాటుకు, హ్యాండ్లూమ్ పార్క్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక చేనేత రంగ అభివృద్ధికి చేపట్టిన చర్యలను మంగళవారం మంత్రి ఒక ప్రకటనలో వివరించారు. తమ ప్రభుత్వం వచ్చాక నేతన్నలకు 10శాతం యార్న్ సబ్సిడీ కింద రూ.33.23కోట్లు విడుదల చేసినట్టు, మరమగ్గాలు, చేనేత మగ్గాల ఆధునీకరణకు 2024-25బడ్జెట్‌లో రూ.400కోట్లు కేటాయించినట్టు, బీసీ వెల్ఫేర్ శాఖ ద్వారా ఈ నిధులను వినియోగించుకునేందుకు ముఖ్యమంత్రి అనుమతించారని చెప్పారు. అన్ని ప్రభుత్వశాఖలు టెస్కో ద్వారా వస్త్రాలు కొనుగోలు చేసేందుకు మార్చి 11న ఉత్తర్వులు జారీచేసినట్టు తెలిపారు. టెస్కో ద్వారా నాన్ ఎవైలబులిటీ సర్టిఫికెట్ తీసుకోకుండా ఏ ప్రభుత్వ శాఖైనా ప్రైవేటు మార్కెట్‌లో వస్త్రాలు కొనుగోలు చేసే అవకాశం లేదని మంత్రి స్పష్టంచేశారు. ఫలితంగా వివిధ ప్రభుత్వ శాఖల నుంచి ఇప్పటివరకు సుమారు రూ. 255.27 కోట్ల విలువైన ఆర్డర్లు టెస్కోకు వచ్చాయని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక ప్రాథమిక చేనేత సహకార సంఘాల ద్వారా రూ. 53కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేసినట్టు, పేమెంట్లు కూడా వెనువెంటనే చేస్తున్నట్టు చెప్పారు. సమగ్ర శిక్ష అభియాన్ పథకం కింద యూనిఫాం సరఫరా నిమిత్తం నూలు కొనుగోలుకు 50 శాతం అడ్వాన్సుగా సుమారు రూ. 50 కోట్లు విడుదల చేసినట్టు మంత్రి వివరించారు.

మొన్న తొండ..నిన్న బల్లి.. నేడు ఉడుత

- రోజుకో జీవి బలి కారణంగా విద్యుత్తు కోతలు
- ఎస్సార్‌నగర్‌లో విద్యుత్తు తీగలపై ఉడుత పడి అంతరాయం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్ అంతరాయానికి కారణమైన జీవుల్లో తొండ, బల్లి పోయి తాజాగా ఉడుత వచ్చి చేరింది. మంగళవారం హైదరాబాద్ నగరంలోని సంజీవరెడ్డి నగర్‌లో విద్యుత్ తీగలపై ఉడుత పడడంతో 11కేవీ ఫీడర్ ట్రిప్ అయి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ఎస్‌ఆర్ నగర్ ఏఈ ఎక్స్‌లో పోస్టు చేశారు. గాలివాన వస్తే కరెంటు పోవడం సర్వసాధారణమే కానీ, తొండ, బల్లి, ఉడుతల వల్ల కరెంటు అంతరాయం కలుగుతోందని విద్యుత్ శాఖ అధికారులే సోషల్ మీడియా వేదికగా పేర్కొనడంపై ప్రజల్లో విమర్శలు వస్తున్నాయి. తరుచూ కరెంటు కోతలతో ప్రజలు సోషల్ మీడియాలో తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల కిత్రం నగరంలోని గోల్కొండ చౌరస్తా (ఆర్టీసీ ఎక్స్ రోడ్డు) సమీపంలోని ప్రాంతంలో మూడు గంటల పాటు కరెంటు సరఫరా లేదని కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇలా గ్రేటర్ పరిధిలోని 9 సర్కిళ్ల పరిధిలో పదుల సంఖ్యలో విద్యుత్ అంతరాయాలపై నిత్యం ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. దీంతో కరెంటు కోతలపై విద్యుత్ అధికారులు కారణాలు వెతుక్కోవాల్సిన దుస్థితి వచ్చిందని నెటిజన్లు సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

'కల్యాణలక్ష్మి' పంపిణీ జాప్యంపై అసంతృప్తి

వివరణ ఇవ్వాలంటూ రాష్ట్రానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): హుజూరాబాద్ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో జాప్యంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. హుజూరాబాద్ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ సూరేపల్లి నంద మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ లబ్ధిదారులకు చెక్కులు సిద్ధమైనా పంపిణీ చేయడానికి రెవెన్యూ అధికారులు అనుమతించడంలేదని తెలిపారు. ఈ నెల 27లోగా చెక్కులను బ్యాంకుల్లో జమచేయని పక్షంలో అవి చెల్లవని చెప్పారు. అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ లబ్ధిదారులు అర్హులైన పక్షంలో చెక్కుల గడువు తీరినా తాజాగా జారీ చేస్తామని హామీ ఇచ్చారు. చెక్కుల అందజేతలో జాప్యంపై వివరాలు చెప్పాలంటూ విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

బస్‌పాస్ కౌంటర్లలోనే జర్నలిస్టులకు పాస్‌లు జారీ

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని అక్రిడేటెడ్ జర్నలిస్టుల రాయితీ బస్‌పాసుల గడువును తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పొడిగించింది. ప్రస్తుత బస్‌పాస్‌ల గడువు ఈ నెల 30తో ముగుస్తోంది. తాజాగా సెప్టెంబర్ 30 వరకు మూడు నెలల పాటు జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల కాలపరిమితిని పొడిగిస్తూ తెలంగాణ సమాచార, పౌరసంబంధాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆన్‌లైన్ ద్వారా బస్‌పాస్‌లను జారీ చేయాలని టీజీఎస్‌ఆర్టీసీ భావించింది. సాంకేతిక కారణాల వల్ల ఆన్‌లైన్ ద్వారా స్వీకరించడం లేదని తెలిపింది. బుధవారం నుంచి బస్‌పాస్ సెంటర్లలో అక్రిడిటేషన్ కార్డు, పాత బస్‌పాస్ చూపించి, కొత్త పాస్‌లను తీసుకోవాలని ఆర్టీసీ సూచించింది.

ఐటీ కట్టినా భరోసా ఇవ్వాల్సిందే

- పెట్టుబడిసాయం ఆలస్యమవొద్దు
- 10 ఎకరాల వరకు పరిమితం చేయండి
- పంద్రాగస్టుకు రుణమాఫీ చేయాల్సిందే
- దొడ్డు వడ్లకూ రూ. 500 బోనస్ ఇవ్వాలి
- కరెంట్ కోతలను నివారించండి
- ప్రభుత్వానికి రైతుల సూచనలు
- కౌలు రైతులకు సాయంపై భిన్నాభిప్రాయాలు
- ఆలస్యమైనా అర్హులకే రైతుభరోసా
- మంత్రి తుమ్మల స్పష్టీకరణ

రైతు భరోసాపై అభిప్రాయాలు తెలుసుకుంటున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ):రైతుబంధు(రైతుభరోసా) నిబంధనల్లో మార్పుల కోసం రైతుల నుంచి సూచనలు తీసుకుందామనుకున్న ప్రభుత్వానికి ప్రశ్నలు ఎదురయ్యాయి. రైతులు సూచనలకన్నా ఎక్కువగా ప్రశ్నల వర్షం కురిపించారు. రైతుబంధు, విద్యుత్, రుణమాఫీ, ధాన్యం బోనస్ ఇలా అన్నింటిపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఐటీ కట్టినా రైతు భరోసా ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. నిబంధనల్లో అతిగా కోతలు వద్దని, 10 ఎకరాల వరకు పరిమితి సరిపోతుందని సూచించారు. రైతుబంధు నిబంధనల్లో మార్పులపై సూచనల నిమిత్తం మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా అన్ని రైతు వేదికల్లో రైతులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినా, ప్రభుత్వం ఆశించిన సూచనలు, సమాధానాలు రాలేదు. ముఖ్యంగా రైతుబంధులో అతిగా కోతలను రైతులు వ్యతిరేకించారు. కొన్నిచోట్ల కాంగ్రెస్ కార్యకర్తలను మాత్రమే మాట్లాడించేందుకు అధికారులు ప్రయత్నించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వారిని నిలువరించి.. తమ సమస్యలను మంత్రికి తెలియజేశారు. రైతుల నుంచి ఊహించనివిధంగా ప్రశ్నలు ఎదురుకావడంతో మంత్రి కూడా కొంత అసహనానికి గురైనట్టుగా తెలిసింది.

రైతుల సూచనలు - సమస్యలు

- పీఎం కిసాన్ మాదిరిగా ఆదాయపుపన్ను చెల్లించేవారికి పెట్టుబడి సాయం ఇవ్వొద్దనే ఆలోచనను విరమించుకోవాలని రైతులు సూచించారు. తాము చిన్న చిన్న అవసరాల కోసం ఐటీ పత్రాలు అందజేశామని, ఆ మాత్రం దానికే పెట్టుబడి సాయం కోత పెడతామంటే ఎలా అని ప్రశ్నించారు. ఈ ఆలోచనను విరమించుకోవాలని సూచించారు.
- ప్రభుత్వం రైతుబంధుకు సీలింగ్ పెట్టదలుచుకుంటే 10 ఎకరాలకు మించిన రైతులకు ఇవ్వొద్దని, 10 ఎకరాలలోపు రైతులకు ఇవ్వాలని సూచించారు.
- పెట్టుబడి సాయాన్ని సమయానికి ఇవ్వాలని కోరారు. ప్రతి ఏటా వానకాలం సీజన్ సాయం జూన్ 15 వరకు, యాసంగి పెట్టుబడి సాయాన్ని నవంబర్ 15 వరకు ఇవ్వాలని కోరారు.
- కౌలు రైతులకు కూడా రైతుబంధు ఇస్తామని ప్రకటించడంపై రైతులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొందరు రైతులేమో కౌలు రైతులు ఇవ్వొద్దని, మరికొందరు ఇవ్వాలని సూచించారు. అసలు రైతుతో సంబంధంలేకుండా కౌలురైతులకు రైతుబంధు సాయం అందించాలని సూచించారు. లేనిపక్షంలో రైతులకు, కౌలు రైతులకు మధ్య గొడవలు ఏర్పడుతాయని సూచించారు.
- వ్యవసాయానికి విద్యుత్ సమస్య పరిష్కరించాలని సూచించారు.
- 2 లక్షల రుణమాఫీని ఎలాంటి కోతలు లేకుండా ఆగస్టు 15వ తేదీ వరకు అమలు చేయాలని సూచించారు.
- ప్రభుత్వం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం సరైనది కాదని రైతులు తెలిపారు. సన్నాలు, దొడ్డు వడ్లకు కూడా రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అర్హులకే రైతుభరోసా : తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయమంత్రి

రైతుభరోసాని పటిష్ఠంగా అమలు చేసేందుకు అవసరమైన నిబంధనలు రూపొందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందని మంత్రి తుమ్మల తెలిపారు. ఇకపై ఏడాదికి ఎకరాకు రూ.15వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. తమ ప్రభుత్వం రైతుభరోసాపై విధానపరమైన నిర్ణయాలు ఇంకా తీసుకోలేదని, అందరి అభిప్రాయాలు తీసుకుని... శాసనసభలో చర్చించాక పథకాన్ని తీసుకొస్తామని చెప్పారు. ఆలస్యమైనా అర్హులకు మాత్రమే అందేవిధంగా రైతుభరోసాకు రూపకల్పన చేస్తామని తెలిపారు. రైతునేస్తం కార్యక్రమంలో ప్రణాళికసంఘం ఉపచైర్మన్ చిన్నారెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, అఖిలభారత కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రైతుసంఘ నాయకుడు అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో డ్రగ్స్ మాట వినిపించొద్దు

- పోలీసులకు డిప్యూటీ సీఎం ఆదేశాలు
- జలవిహార్‌లో యాంటీ డ్రగ్ డే

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారి నిర్మూలనకు ప్రభుత్వం ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ అనే మాట వినిపించకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని, అవసరమైతే గ్రామస్థాయిలో కమిటీలు వేయాలని ఆదేశించారు. ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు, వివిధ విభాగాల అధికారులు అందరూ కలిసికట్టుగా డ్రగ్స్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. డ్రగ్స్ నిర్మూలకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదని తెలిపారు. సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ షూటర్ ఇషా సింగ్, నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, పలువురు ఐఏఎస్‌లు, ఏడీజీపీలు పాల్గొన్నారు.

భూముల విలువ 50% పెంపు!

- మార్కెట్ విలువలో సగం వరకు పరిమితి
- సీజీజీ కార్యాలయానికి చేరిన నివేదికలు
- నేడు సమీక్ష నిర్వహించే అవకాశం
- పెంపుపై పునరాలోచనలో ప్రభుత్వం?

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువను 50 శాతం వరకు పెంచే అవకాశాలున్నాయి. ఇందుకు సంబంధించి స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖకు ప్రతిపాదనలు అందినట్టు తెలుస్తున్నది. కనిష్ఠంగా 20%, గరిష్ఠంగా 50% పెంచాలని ఆ ప్రతిపాదనల్లో పేర్కొన్నట్టు సమాచారం. ఈ పెంపు బహిరంగ మార్కెట్ విలువలో సగానికి మించకూడదని సూచించినట్టు తెలుస్తున్నది. మార్కెట్ విలువ పెంపుపై స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఈ నెల 18 నుంచి క్షేత్రస్థాయి అధ్యయనం చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 143 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని గ్రామాలు, పట్టణాలు, సర్వే నంబర్లవారీగా వ్యవసాయ భూములు, స్థలాలు, వెంచర్లు, అపార్ట్మెంట్లకు సంబంధించిన అధ్యయనాన్ని పూర్తి చేసింది. ప్రస్తుత ధరలు, బహిరంగ మార్కెట్‌లోని విలువలను కలెక్టర్ల నేతృత్వంలోని కమిటీలు అధ్యయనం చేసి, ఏ మేరకు పెంచవచ్చో ప్రతిపాదనలు రూపొందించాయి. సంబంధిత ప్రాథమిక అంచనాలను స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్- ఇన్‌స్పెక్టర్ జనరల్ (సీఐజీ) ప్రధాన కార్యాలయానికి అందజేశాయి. ఈ నివేదికపై మంగళవారం సీఐజీ ఆధ్వర్యంలో సమీక్ష జరిపి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సి ఉన్నది. కానీ, ప్రభుత్వం తాజా బదిలీల్లో జ్యోతి బుద్ధ ప్రకాశ్‌ను సీఐజీగా నియమించింది. ఈ నేపథ్యంలో సమీక్ష వాయిదా పడినట్టు తెలుస్తున్నది. బాధ్యతలు తీసుకున్న తర్వాత సమీక్ష జరుపనున్నట్టు సమాచారం.

పెంపుపై మల్లగుల్లాలు

భూ విలువల సవరణపై ప్రభుత్వం పునరాలోచనలో పడినట్టు తెలుస్తున్నది. కొన్ని రోజులుగా రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గుతున్నట్టు ప్రభుత్వానికి నివేదికలు అందాయి. వాస్తవానికి భూముల ధరలు పెంచుతుందన్న ప్రకటన వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్లు జోరందుకుంటాయి. డబ్బు ఆదా చేసుకునేందుకు ముందస్తుగా క్రయవిక్రయాలు జరుపుతుంటారు. కానీ, రాష్ట్రంలో కొన్నాళ్ల నుంచి రిజిస్ట్రేషన్లు క్రమంగా తగ్గుతున్నట్టు తెలిసింది. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న ఓ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజూ కనీసం 20-25 రిజిస్ట్రేషన్లు చోట మంగళవారం సగం కూడా జరగలేదట. ఈ నేపథ్యంలో భూముల ధరల పెంపుపై ప్రభుత్వం పునరాలోచన జరుపుతున్నట్టు చెప్తున్నారు. ఆగస్టు 1 నుంచి కొత్త ధరలను అమల్లోకి తేవాలని ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ.. దసరా వరకు వాయిదా పడవచ్చని వినికిడి.

శంషాబాద్‌లో గుర్తుతెలియని జంతువు

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ) : శంషాబాద్ ఘన్సీమియాగూడలో రెండు రోజులుగా గుర్తుతెలియని జంతువు సంచరిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయని రంగారెడ్డి జిల్లా డీఎఫ్‌వో విజయానంద్ తెలిపారు. ఆ జంతువు హైనా నా, చిరుతనా అనేది గుర్తించలేకపోతున్నామన్నారు. 10 ట్రాప్ కెమెరాలు, 3 బోన్లు ఏర్పాటు చేశామని, ఎక్కడా జంతువు ఆనవాళ్లు దొరకలేదని స్పష్టం చేశారు. అడవి నుంచి బయటకు వచ్చిన జంతువులు.. త్వరగా ట్రాప్‌లో పడవని, ప్రజలెవరూ భయాందోళనకు గురికావద్దని సూచించారు. కాగా .. నెల రోజుల క్రితం శంషాబాద్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై చిరుత కలకలం సృష్టించింది. అదే చిరుత రన్‌వేపైకి వచ్చి ఉంటుందని తెలిపారు. కొన్ని నెలల క్రితం షాద్‌నగర్ ప్రాంతంలోనూ చిరుత కనిపించిందని, వారం రోజులు శ్రమించి దాన్ని పట్టుకున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

41వేల ఏండ్ల కిందటి పక్షిగూడు గుర్తింపు

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో వడోదరలోని ఎంఎస్ విశ్వవిద్యాలయానికి చెందిన పురావస్తు శాస్త్రవేత్తల బృందం జర్మనీ, ఆస్ట్రేలియా, యూఎస్‌కు చెందిన సైంటిస్టులతో కలిసి పరిశోధనలు చేశారు. ఈ క్రమంలో 41 వేల సంవత్సరాల క్రితం నాటి నిప్పుకోడి గూడు కనిపెట్టారు. 40 కిలోల కంటే ఎక్కువ బరువున్న జంతువులు ఎందుకు అంతరించిపోయాయని చేస్తున్న పరిశోధనలో భాగంగా ఈ పక్షి గూడుని వారు కనుగొన్నారు. ఈ గూడులో 9 నుంచి 11 గుడ్లు ఉండేవని పేర్కొన్నారు. వీటి గుడ్లు ఒక్కోటి 10 అడుగుల వెడల్పు ఉంటుంది. గతంలో దక్షిణ భారతదేశంలో 3,500 నిప్పుకోడి గుడ్ల పెంకులు శాస్త్రవేత్తలు కనుగొన్నారు.

ఆంధ్రప్రదేశ్ టెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెట్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 6 వరకు నిర్వహించిన టెట్‌కు 2,35,907 మంది హాజరుకాగా, 1,37,904 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. 58.4 శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. కొత్తగా బీఎడ్, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికి త్వరలోనే మళ్లీ టెట్‌ను నిర్వహిస్తామని వివరించారు. టెట్ ఫలితాల తరువాత మెగా డీఎస్సీ ప్రకటిస్తామని పేర్కొన్నారు.



మంగళవారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, చిత్రంలో జేఏసీ నేతలు

ఇక మాకు ఓపికలేదు

- కొత్త ప్రభుత్వమని వేచి చూశాం
- ఒకటో తేదీన జీతాలే ముఖ్యం కాదు
- ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు
- పెండింగ్‌లో అనేక సమస్యలున్నాయి
- పరిష్కరించకుంటే పోరుబాటే
- ఉమ్మడి పోరాటానికి కార్యాచరణ
- ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ జగదీశ్వర్

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): కొత్త ప్రభుత్వమని ఇన్నాళ్లు ఓపికపట్టామని, ఇక తమకు ఓపిక లేదని రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలిచ్చినా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించే దిశలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సన్నాహక సమావేశాన్ని మంగళవారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించారు. రాష్ట్రంలోని 34 సంఘాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రంలో 104 సంఘాలుండగా, త్వరలో వారికి జేఏసీలో సభ్యత్వం కల్పించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ జగదీశ్వర్ మాట్లాడుతూ గతంలో రెండు డీఏలు పెండింగ్‌లో ఉంటేనే ధర్నాలకు దిగిన సందర్భాలున్నాయని, ఇప్పుడు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, జూలై వస్తే ఐదో డీఏ ప్రభుత్వం బాకీపడుతుందని చెప్పారు.

కొత్త ప్రభుత్వమని ఓపికపట్టాం: ఏలూరి

రాష్ట్రంలోని ఉద్యోగులు అనేక సమస్యల్లో ఉన్నారని, 150 సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంత కాలం కొత్త ప్రభుత్వమని, రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని ఓపికపట్టామని టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. తాము ఓపికపట్టినా కిందిస్థాయి అధికారులు, ప్రాథమిక సభ్యులు తమ తక్షణమే సమస్యలు పరిష్కారం కావాలని కోరుకుంటున్నారని, ఉద్యోగులను నుంచి తీవ్రమైన ఒత్తిడి వస్తోందని చెప్పారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జేఏసీగా ఏర్పడ్డామని, ప్రస్తుతం 34 సంఘాలతో ఉన్నా మిగిలిన అన్ని సంఘాలను కలుపుకుని పోరాటాలకు సిద్ధమని ప్రకటించారు. ఒకటో తారీకున జీతం రాజ్యాంగం కల్పించిన హక్కు అని, సీఎం, మంత్రులు ఓ రెండు గంటలు సమయం కేటాయిస్తే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. దివ్యదేవరాజన్, చిన్నారెడ్డి, కోదండరాంతో కమిటీ వేసినట్టు పేపర్లల్లో మాత్రమే కనిపించిందని, అధికారులను కలిస్తే ఉత్తర్వులే ఇవ్వలేదన్నారని వాపోయారు. టీచర్ల తరహాలోనే ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని, 17 శాతం డీఏ పెండింగ్‌లో ఉందని, కనీసం రెండు డీఏలను ఇవ్వాలని, ఉద్యోగుల చందాతో ఈహెచ్‌ఎస్‌లు అమలుచేయాలని, సీపీఎస్‌పై కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు ఎండీ ముజీబ్ హుస్సేనీ, ఏనుగుల సత్యనారాయణ, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి (ఇంటర్ విద్యా జేఏసీ), వంగ రవీందర్‌రెడ్డి, కే గౌతమ్‌కుమార్ (ట్రెసా), మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ (గ్రూప్ 1 అధికారుల సంఘం), లచ్చిరెడ్డి, కే రామకృష్ణ (డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్), మణిపాల్‌రెడ్డి (టీటీయూ), జ్ఞానేశ్వర్ (నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం) తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో ఆమోదించిన తీర్మానాలు

- కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి
- ఉద్యోగుల చందాతో కూడిన ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలి. ఐఆర్ 5శాతం నుంచి 20శాతానికి పెంచాలి.
- బకాయి పడ్డ డీఏలను విడుదల చేయాలి. పెన్షనర్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి.
- ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి.
- గచ్చిబౌలిలో టీఎన్జీవో రెండోదశకు కేటాయించిన 101.02 ఎకరాల స్థలంపై సొసైటీకి యజమాన్య హక్కులు కల్పించాలి. భాగ్యనగర్ టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీకి రంగారెడ్డి జిల్లా గోపనపల్లిలో కేటాయించిన స్థలాలకు సంబంధించిన మెమోను రద్దు చేసి ఇండ్లస్థలాలు కేటయించాలి.
- ఉద్యోగ పెన్షనర్లకు ఆదాయ పన్ను పరిమితిని పెంచేటట్టు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.
- సచివాలయంలోకి హెచ్‌వోడీల నుంచి 12.5శాతం ఉద్యోగులను కేటాయించే విధానాన్ని అమలు చేయాలి.
- జీవో -317లోని లోపాలను సవరించి, పాత ఉద్యోగులకు పాత సీనియారిటీని కొనసాగించాలి. నూతన జిల్లాల్లో అదనపు కేడర్ స్ట్రెంథ్‌ను మంజూరుచేయాలి.
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలి.
- రంగారెడ్డి కలెక్టరేట్ ఉద్యోగులకు పాత పద్ధతిలోనే 24శాతం ఇంటి అద్దెను మంజూరు చేయాలి.
- పాత పీఆర్సీ పెండింగ్ బిల్లులను చేసుకోవడానికి గడువును 31-3-2023 వరకు పొడగించి, ఆయా తేదీ వరకు ట్రెజరీ శాఖకు అనుమతినివ్వాలి.
- మెడికల్ రీయింబర్స్‌మెంట్ అనుమతిని 31-3-2024 నుంచి 31-3-2026 వరకు పొడిగించాలి. రాష్ట్రంలో మెడికల్ ఇన్వాల్విడేషన్ కమిటీలను ఏర్పాటు చేసి కారుణ్య నియామకాలు చేపట్టాలి. రిటైర్డ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోకూడదు.
- ఉద్యోగుల మీద కక్ష సాధింపులకు పాల్పడటాన్ని, అక్రమ కేసుల నమోదును అరికట్టాలి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి.